క్లుప్తంగా

పేదల జీవితాలకు భరోసా వైఎస్సార్ బీమా



సత్తెనపల్లి: పేదల జీవితాల్లో వైఎస్సార్ బీమా భరోసా నింపుతుందని వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్ అన్నారు. పట్టణంలోని 19వ వార్డుకు చెందిన బండి అనంతరావు ఇటీవల మృతి చెందడంతో మృతుడి భార్య బండి వెంకట రమణకు వైఎస్సార్ బీమా కింద నగదును శనివారం అందించారు. అచ్యుత శివప్రసాద్ మాట్లాడారు. కౌన్సిలర్ అవ్వారు శ్రీనివాసరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి, నాయకులు తుమ్మల వెంకటేశ్వర రావు, యసారపు విజయ్‌కుమార్(బుజ్జి), వెల్ఫేర్ సెక్రటరీ బాషా, వలంటీర్ రాధిక ఉన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

అమరావతి: మండల పరిధిలోని ధరణికోటకు చెందిన అమరావతి పాస్టర్స్ ఫెలోషిప్ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రోగులకు క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అమరావతి పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు పాస్టర్ ప్రభుదాస్, సెక్రటరీ పాస్టర్ నండూరి పీటర్ పాల్, పాస్టర్ గుంటూరు బాబు రావు, పాస్టర్లు ప్రకాష్, విజయ్ కుమార్, దాని యేలు, జోర్నిష్ పాల్గొన్నారు.

మాజీ ప్రధాని పీవీకి ఘననివాళి

బెల్లంకొండ: బహు భాషావేత్త, భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జీవితాన్ని ప్రతీ ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని బ్రాహ్మణ ఐక్య వేదిక ముఖ్య సలహాదారు పులుపుల వేంకట ఫణికుమార శర్మ తెలిపారు. శనివారం పీవీ నరసింహారావు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి బ్రాహ్మణ ఐక్య వేదిక నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కవిగా, రచయితగా ఆయన మంచిపేరు తెచ్చుకున్నారని, ప్రమాదపుటంచున ఉన్న భారతదేశ ఆర్థిక పరిస్థితిని చక్కదిద్ది, ప్రాణం పోసిన అపర చాణక్యుడుగా నిలిచారని తెలిపారు. ఆయన సేవలను ప్రభుత్వం గుర్తించి భారతరత్న ఇవ్వాలని, ఆయన స్ఫూర్తివంతమైన పీవీ జీవితాన్ని భారతీయ భాషలలో పాఠ్యాంశంగా ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. సత్తెనపల్లి బ్రాహ్మణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో త్వరలో విగ్రహ ఆవిష్కరణ జరుగుతుందని పేర్కొన్నారు. రాజశేఖర శర్మ, క్లెం విష్ణువర్ధన శర్మ, వేంకట సత్యతల్పశాయి బాబు, రాజశేఖరుని లక్ష్మీ నరసింహారావు, పవన శర్మ, కృష్ణ సాయి శర్మ తదితరులు పాల్గొన్నారు.

సత్తెనపల్లిలో..

సత్తెనపల్లి: ఆర్థిక సంస్కరణల రూపశిల్పి భారత మాజీ ప్రధాని, దివంగత పీవీ నరసింహారావు అని ప్రముఖ సాహితీవేత్త మంచికంటి వెంకటేశ్వరరావు అన్నారు. భారత మాజీ ప్రధాని, బహుభాషాకోవిదుడు పి.వి.నరసింహారావు వర్ధంతి పట్టణంలోని బ్రాహ్మణ ఐక్యవేదిక సత్తెనపల్లి డివిజన్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐక్యవేదిక డివిజన్ అధ్యక్షుడు పెద్దింటి ఫణికృష్ణ, సభ్యులు కొండకావూరి మార్కండేశ్వరశర్మ, బెల్లంకొండ నరసింహారావు పాల్గొన్నారు.


వంద రోజులు ఉపాధి పనులు చూపించాలి

క్రోసూరు: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పనుల్లో కూలీలకు ఫీల్డ్ అసిస్టెంట్లు తప్పనిసరిగా 100 రోజుల పని కల్పించాలని పల్నాడు జిల్లా డ్వామా పీడీ గంగవరపు జోసఫ్‌కుమార్ కోరారు. మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో శనివారం ఉపాధిహామీ పనులకు సంబంధించిన ప్రజావేదికలో డ్వామా పీడీ పాల్గొని కార్యక్రమ నివేదికలను పరిశీలించారు. ఈసందర్భంగా మండలంలోని 18 పంచాయతీల్లో జరిగిన రూ.4.5 కోట్లకు జరిగిన ఉపాధి పనులు, రూ.3.5 కోట్ల పంచాయతీరాజ్ పనులకు సంబంధించిన సోషల్ ఆడిట్ రిపోర్టులను ప్రజావేదికలో పరిశీలించారు. డీఆర్పీలు ఆయా గ్రామాల నివేదికలు చదవగా పీడీ పరిశీలించటం జరిగింది. అన్ని గ్రామ పంచాయతీలో ఉపాధి పనులు కేవలం 70 రోజుల నుంచి 75 రోజుల కు మాత్రమే చేయించినట్లు గుర్తించగా 100 రోజుల పనులు తప్పనిసరిగా చేయించాలని ఫీల్డ్అసిస్టెంట్లను ఆదేశించారు. ఉపాధిహామీ విజిలెన్స్ అధికారి టీవీ విజయలక్ష్మీ, ఏపీడీ నారాయణ, ఎంపీడీఓ బి.మహేష్‌బాబు, జెడ్పీటీసీ షేక్ జమీలా గఫూర్, ఎస్ఆర్‌పీ ఎం.బుజ్జి, ఏపీఓ వెంకటేశ్వర రావు, డీఆర్‌పీలు, ఫీల్డు అసిస్టెంట్లు, అన్ని గ్రామాల పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

మృతి చెందిన ఎఫ్ఏ కుటుంబానికి రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియో

ఉపాధిహామీ శాఖ లో పనిచేసే మండలంలోని హసనాబాద్ గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్(ఎఫ్ఏ) షేక్ మస్తాన్‌వలి మృతి చెందగా, అతని భార్య షేక్ సైదాబీకి ఉపాధిహామీ శాఖ ద్వారా మంజూరైన రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియోను పీడీ జోసఫ్‌కుమార్ అందజేశారు. ఎంపీడీఓ బి.మహేష్, ఎంపీపీ పి.కోటయ్య, జెడ్పీటీసీ జమీల గఫూర్, వైస్ ఎంపీపీ వి.వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా రాంబాబు



సత్తెనపల్లి: ఎస్సీ, ఎస్టీ, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సత్తెనపల్లి డివిజన్ సభ్యుడిగా సత్తెనపల్లి మండలం బృగుబండ గ్రామానికి చెందిన దుగ్గి రాంబాబు నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాల నివారణకు, పేదలకు అందాల్సిన చట్టాలను, పోలీసు ఇతర ప్రభుత్వ శాఖల ద్వారా అందించేందుకు కృషి చేస్తానన్నారు.



వద్దవల్లిలో స్వర్ణ కవచ అలంకారంలో శ్రీవారు



సత్తెనపల్లిలో ఉత్తరద్వార దర్శనంలో కిటకిటలాడుతున్న భక్తులు



సత్తెనపల్లి రైల్వేస్టేషన్‌రోడ్డులో ప్రత్యేక అలంకారంలో శ్రీవారు

వైభవంగా ముక్కోటి ఏకాదశి

ముక్కోటి ఏకాదశి పర్వదిన వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. ధనుర్మాసాన్ని పురస్కరించుకొని ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి విగ్రహాలను శోభాయమానంగా అలంకరించి పూజలు చేపట్టారు. నియోజకవర్గంలోని సత్తెనపల్లి పట్టణం, మండలం, పెదకూరపాడు, అచ్చంపేట, నకరికల్లు, రాజుపాలెం, బెల్లంకొండ, ముప్పాళ్ల మండలాల్లోని పలు ఆలయాల్లో స్వామివార్లు ఉత్తరద్వారం ద్వారా దర్శనమిచ్చారు. దర్శించుకున్న భక్తులు తరించిపోయారు. అన్ని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు పరిశీలించగా, పోలీసులు బందోబస్తు నిర్వహిచారు.

– సత్తెనపల్లి



విశేష అలంకరణలో దేచవరంలోని మహలక్ష్మీ గోదా సమేత వేంకటేశ్వరస్వామి

క్రీస్తు మార్గం అనుసరణీయం

- డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ చంద్రశేఖర్
- ఘనంగా సెమీక్రిస్మస్ వేడుకలు

సత్తెనపల్లి: క్రీస్తు మార్గం అనుసరణీయమని వైద్య ఆరోగ్యశాఖ డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ చంద్రశేఖర్ అన్నా రు. పట్టణంలోని బాగ్స్ మెమోరియల్ సెంటినరీ బాప్టిస్ట్ చర్చి ఆవరణలో అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ధర్మ సింగ్ శాస్త్రి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఏసుక్రీస్తు బోధ నలు ప్రతి ఒక్కరూ అనుసరించాలన్నారు. తొలుత క్రిస్మస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. పాస్టర్ కె.రమేష్ ప్రార్థన నిర్వహించారు. కార్యక్రమంలో చర్చి అధ్యక్షుడు జి.మార్క్‌రావు, డీఐఓ డాక్టర్ గీతాంజలి, డాక్టర్ కిషోర్, డాక్టర్ అనూష, డాక్టర్ భాను ప్రకాష్, డాక్టర్ ఏసియా, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో..

మానవాళిని రక్షించడానికి ప్రభువైన ఏసుక్రీస్తు ఈ లోకంలో ఉద్భవించి యుగ పురుషుడిగా నిలిచారని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి అన్నారు. పట్టణ సచివాలయాల ఎంప్లాయీస్ ఫెడరేషన్, పురపాలక సంఘ ఉద్యోగుల ఆధ్వర్యంలో పట్టణంలోని బాగ్స్ మెమోరియల్ సెంటినరీ తెలుగు బాప్టిస్ట్ చర్చి ఆవరణలో శనివారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకలకు సచివాలయాల ఎంప్లాయీస్ ఫెడరేషన్ పట్టణ అధ్యక్షుడు సందెపోగు శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. మున్సిపల్ కమిషనర్



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ చంద్రశేఖర్

కొలిమి షమ్మి మాట్లాడుతూ ఏసుక్రీస్తు తెలిపిన విధంగా తోటి వారి పట్ల ప్రేమ, దయ, క్షమా గుణాలను అలవర్చు కోవాలన్నారు. సంఘ కాపరి మేకల ప్రభుదాస్ వాక్యోపదేశం చేశారు. తొలుత కమిషనర్ కొలిమి షమ్మి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ డీఈ బి. మధుసూదన్‌రావు, చర్చి కమిటీ అధ్యక్షుడు గుజ్జర్లపూడి మార్క్‌రావు, సచివాలయాల యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు షేక్ కరిముల్లా, ప్రదీప్, గౌరీ శంకర్, సౌభాగ్య లక్ష్మి, భూలక్ష్మి, షేక్ అబ్దుల్ కరీం, రెబ్బవరపు సురేష్, చంద్రమౌళి, జోజప్ప, రేచల్ పాల్గొన్నారు.

రేపు కమ్యూనిటీ గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు

సత్తెనపల్లి: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని 31వ వార్డు అంబేడ్కర్ నగర్‌లో ఈ నెల 25న రాత్రి 6.30 గంటలకు నిర్వహించనున్న కమ్యూనిటీ గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు విజయవంతం చేయాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబురావు శనివారం పేర్కొన్నారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు



దేచవరంలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న పాస్టర్ బి.బాబూరావు, భవనం రాఘవరెడ్డి

హాజరవుతారన్నారు. ఈ వేడుకల్లో 500 మంది పేద వృద్ధులకు, మహిళలకు దుప్పట్లు, చీర ల పంపిణీ జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

దేచవరంలో..

నకరికల్లు: క్రీస్తు బోధనలు అనుసరణీయమని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి అన్నారు. మండలంలోని దేచవరం గ్రామంలోని చర్చిలో శనివారం రాత్రి సెమీక్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్రిస్మస్ కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. పాస్టర్ బొక్కా బాబూరావు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్ బాబూరావు మాట్లాడుతూ ఏసుక్రీస్తు లోక రక్షకుడన్నారు. లోకాన్ని రక్షించేందుకు దేవాది దేవుడైన క్రీస్తు మానవాకారంలో కన్య మరియకు జన్మించారన్నారు. ఆయనయందు విశ్వాసముంచిన వారు రక్షించబడేందుకే క్రీస్తు లోకంలోకి ఏతెంచారన్నారు. ఎన్నారై భవనం సుభాష్ చంద్రబోస్‌రెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షుడు దొండేటి కోటిరెడ్డి, ఉపసర్పంచ్ భవనం రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనంతవరంలో 'వికసిత్ భారత్ సంకల్పయాత్ర'



కార్యక్రమంలో మాట్లాడుతున్న భారత ప్రభుత్వ జాతీయ మత్స్యశాఖ విశాఖపట్నం ప్రతినిధి పాపారావు

అనంతవరం(క్రోసూరు): దేశ ప్రజలందరి సహకారంతో భారతదేశాన్ని 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతోనే భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమ లక్ష్యంగా చేపట్టారని భారత ప్రభుత్వ జాతీయమత్స్యశాఖ విశాఖపట్నం ప్రతినిధి పాపారావు అన్నారు. మండలంలోని అనంతవరంలో శనివారం జరిగిన కార్యక్రమంలో పాపారావు పాల్గొని మాట్లాడారు. గ్రామ సర్పంచ్ పి.రామయ్య అధ్యక్షత వహించారు. ప్రజలకు అందజేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించడంతోపాటు వాటిని అర్హులైన వారికి నూరు శాతం అందే విధంగా సంకల్ప యాత్ర ఉద్దేశ్యమని అన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొని 17 రకాల కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. వైద్యాధికారి సిరి చందన ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. రైతులు ఎరువుమందు చల్లే డ్రోన్ ఉపయోగించే విధానం గూర్చి వ్యవసాయశాఖ అధికారులు వివరించారు. ఎంపీడీఓ మహేష్, సర్పంచ్ రామయ్య, ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్, ఎంపీటీసీ వేణుగోపాల రెడ్డి, పంచాయతీ కార్యదర్శి షేక్ షాహిదా వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు .

క్రీడాకారులను ప్రోత్సహించేందుకే 'ఆడుదాం ఆంధ్ర'

సత్తెనపల్లి: ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం – ఆంధ్ర క్రీడా పోటీలను నిర్వహిస్తుందని మున్సిపల్ చైర్ పర్సన్ చల్లంచర్ల లక్ష్మీ తులసి అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఆడుదాం– ఆంధ్ర సన్నాహక సమావేశం, ర్యాలీలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చైర్ పర్సన్ చల్లంచర్ల లక్ష్మీతులసి మాట్లాడుతూ దేశంలో ఏ ప్రభుత్వం గతంలో ఎన్నడూ నిర్వహించని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఈ నెల 26 నుంచి అతిపెద్ద క్రీడా సంబరానికి శ్రీకారం చుట్టిందన్నారు. మొత్తం 5 క్రీడాంశాలలో 51 రోజులపాటు సచివాలయ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రీడా పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. సచివాలయ స్థాయిలో నిర్వహించే పోటీలకు సంబంధించిన జట్లను సిద్ధం చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారన్నారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం – ఆంధ్ర పేరుతో క్రీడాకారులను ప్రోత్సహిస్తుందన్నారు. ఈ క్రీడా పోటీల్లో నియోజకవర్గ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు మొత్తంగా రూ.12 కోట్ల నగదు మొత్తాన్ని అందజేయనుందన్నారు. మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడదాం – ఆంధ్ర క్రీడా పోటీలను అందరి సహకారంతో విజయవంతం చేసేలా చర్యలు చేపడుతున్నామన్నారు. పోటీల నిర్వహణకు అవసరమైన క్రీడా సామాగ్రి సరఫరా చేయడం జరిగిందన్నారు. తొలుత చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీ తులసి



సత్తెనపల్లిలో ర్యాలీ ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీతులసి

ఆడుదాం – ఆంధ్ర ర్యాలీ జెండా ఊపి ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు బండి మల్లిఖార్జునరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ ఐఎస్ నాగిరెడ్డి, సెక్షన్ హెడ్లు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర'పై సమీక్ష

క్రోసూరు: ఆడుదాం –ఆంధ్రా ఆటలు ప్రతి పంచాయతీలో పండుగ వాతవరణంలో ఘనంగా జరగాలని క్రీడల జోనల్ అధికారి, డ్వామా పీడీ జి.జోసఫ్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఆడుదాం–ఆంధ్రా ఆటలపై మండలంలోని వివిధ శాఖల అధికారులు, పాఠశాలల పీఈటీలతో సమీక్షా సమావేశం జరిగింది. ఈసందర్భంగా పీడీ మాట్లాడుతూ ప్రతి సచివాలయం నుంచి ఐదు క్రీడలకు సంబంధించి 10 టీములు మహిళలు, 10 టీములు పురుషులు ఎంపిక చేసుకోవాలన్నారు. ఈనెల 26 నుంచి ప్రతి సచివాలయంలో ఆటలు నిర్వహించాలన్నారు. ఆటల ఆడే జట్ల కోసం కిట్లు కూడా సిద్ధంగా ఉన్నాయన్నారు. ఎంపీడీఓ బి.మహేష్, ఏపీడీ నారాయణ, ఎంపీపీ పి.కోటయ్య, జెడ్పీటీసీ షేక్ జమీలా గఫూర్, ఏఎంసీ వైస్ చైర్మన్ గార్లపాటి దాసు, పాల్గొన్నారు.

విద్యతోనే బంగారు భవిష్యత్తు

రెంటచింతల: సమాజంలోని పేద విద్యార్థులకు విద్యతోనే బంగారు భవిష్యత్తు ఉంటుందనే ప్రగాఢ విశ్వాసంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను ఉచితంగా అందజేస్తున్నట్లు ఎంపీపీ దాసరి చౌడేశ్వరి అన్నారు. శనివారం మండలంలోని జెట్టిపాలెం ఏపీ మోడల్ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థులకు ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, సర్పంచ్ దావులూరి ఉదయకుమారి రమేష్, పార్టీ నాయకులతో కలసి ట్యాబ్‌లు పంపిణీ చేసి మాట్లాడారు. రాష్ట్రంలోని పేదల పిల్లలకు నాణ్యమైన విద్య దూరమైన విషయాన్ని గమనించిన సీఎం జగన్ వారికి మంచి చదువులు అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నారన్నారు. ఇందులో భాంగా నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. విద్యకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ, ఎన్నో పథకాలను అమలుచేస్తూ విద్యార్థులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. డీడీఓ, మండల ప్రత్యేక అధికారి, ఎంపీడీఓ యార్ల మహాలక్ష్మి మాట్లాడుతూ దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలో ఇప్పటివరకు అమలుచేయని పథకాల ద్వారా ముఖ్యమంత్రి విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. పేద విద్యార్థులకు సీఎం జగన్ ఆత్మబంధువుగా మారి వారి జీవితాలలో వెలుగులు నింపుతున్నారన్నారు. ఎంఈఓ–2 శివనాగేశ్వరరావు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు గొట్టం బ్రహ్మారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నవులూరి భాస్కర్‌రెడ్డి, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులున్నారు.



విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేసిన ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, సర్పంచ్ ఉదయకుమారి రమేష్

రైతులకు సబ్సిడీపై శనగలు

పెదకూరపాడు: మిచాంగ్ తుఫాన్‌తో పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం 80 శాతం సబ్సిడీపై శనగలు మండలంలోని బలుసుపాడు గ్రామంలో పంపిణీ చేశారు. ఈసందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకుడు హనుమంత రావు మాట్లాడుతూ ప్రభుత్వం నష్టపోయిన రైతులను తక్షణమే ఆదుకుంటుందన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఇచ్చిన హామీలు అమలు చేసి చూపించారన్నారు. వ్యవసాయ శాఖ అధికారి శాంతి, వీఏఏలు పాల్గొన్నారు.

కాచి, చల్లార్చిన నీటిని తాగాలి

సత్తెనపల్లి: పట్టణంలో కుళాయిల ద్వారా సరఫరా అవుతున్న మంచినీటిని కాచి, చల్లార్చి, వడగట్టి వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి శనివారం తెలిపారు. పురపాలక సంఘంనకు చెందిన మంచినీటి నిల్వ చెరువులో నీటిమట్టం రోజు రోజుకు తగు ముఖం పడుతున్నందున కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్న మంచినీరు కొంత రంగు మారడం జరుగుతుందన్నారు. పట్టణ ప్రజలు పురపాలక సంఘానికి సహకరించాలని ఆయన కోరారు.

సర్వే రాళ్ల ఏర్పాటుకు సహకరించాలి

రొంపిచర్ల : పంట భూముల్లో సర్వే రాళ్లు వేసేందుకు భూమి యజమానులు సహకరించాలని నరసరావుపేట ఆర్డీవో ఎం. శేషిరెడ్డి అన్నారు. మెగా స్టోన్ ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలో విప్పర్ల గ్రామంలో సర్వే రాళ్లు పాతే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పరిశీలించిన ఆర్డీవో శేషిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం వారు జరిపిన రీసర్వే ప్రకారము రైతులకు చెందిన పొలాల్లో వచ్చిన విస్తీర్ణము ప్రకారం సర్వే రాళ్లు పాతిస్తున్నామన్నారు. పొలాల్లో సర్వే రాళ్లు వేస్తున్న సర్వే, రెవెన్యూ సిబ్బందికి రైతులు సహకరించాలని కోరారు. అనంతరం ఆ గ్రామంలో 200 సర్వే రాళ్లు పాతించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జి.అంకారావు, వీఆర్వో సురేష్, సచివాలయం సర్వేయర్‌లు లక్ష్మణ్, జోసఫ్, కశిరెడ్డి వెంకట కోటిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.



పంట భూముల్లో సర్వేరాళ్లు పాతుతున్న సిబ్బంది, పరిశీలిస్తున్న ఆర్డీవో ఎం. శేషిరెడ్డి

వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

సత్తెనపల్లి: ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకబడిన వడ్డెర కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలని వడ్డెర సంక్షేమ సంఘం నాయకుడు తురక అమర్నాథ్ డిమాండ్ చేశారు. వడ్డెర్ల ను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరుతూ నవంబర్ 22న తిరుపతి నుంచి విజయవాడ వరకు తురక అమర్నాథ్ ఆధ్వర్యంలో 25 మందితో చేపట్టిన పాదయాత్ర శనివారం సత్తెనపల్లికి చేరింది. పాదయాత్ర బృందానికి సత్తెనపల్లి నియోజకవర్గ వడ్డెర సంక్షేమ సంఘం నాయకులు ఘనస్వాగతం పలికారు. పట్టణంలోని తాలూకా సెంటర్ వరకు పాదయాత్ర చేశారు. అనంతరం తాలూకా సెంటర్‌లో ఉన్న వడ్డెర సత్తెన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా అమర్నాథ్ మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 40 లక్షలమంది వడ్డెర కులస్తులు ఉన్నారని, ఎస్టీ జాబితాలో చేరుస్తామని రాజకీయ పార్టీలు ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. వడ్డెర సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడు వేముల వరప్రసాదరావు, నియోజకవర్గ అధ్యక్షుడు తన్నీరు శ్రీనివాసరావు, వడ్డెర సంఘం నేతలు చల్లా శ్రీనివాసరావు, బత్తుల సాంబశివరావు, పల్లపు అంకమ్మరావు పాల్గొన్నారు.

చైన్ స్నాచర్ అరెస్ట్

నకరికల్లు: మహిళల మెడలో బంగారుచైన్‌లు, నాంతాడులను లాక్కొని చోరీకి పాల్పడుతున్న నిందితుడిని అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ ఎ.బాలకృష్ణ శనివారం తెలిపారు. ఒంగోలు పట్టణానికి చెందిన షేక్ కృపారావు దుర్వ్యసనాలకు అలవాటు పడి నడుచుకుంటూ వెళ్తున్న, స్కూటీలపై వెళ్తున్న మహిళల మెడలో గొలుసులను చోరీ చేస్తుండేవాడు. అతనిపై నకరికల్లు, సత్తెనపల్లి టౌన్, రూరల్, రొంపిచర్ల, పిడుగురాళ్ల, అద్దంకి, నల్లపాడు, పట్టాభిపురం, నగరంపాలెం పోలీస్‌స్టేషన్‌లలో 15 చోరీకేసులు నమోదైనట్లు తెలిపారు. అతని వద్ద నుంచి 280.33 గ్రాముల బంగారు ఆభరణాలు వివిధ బ్యాంకులో ఉన్నట్లు ఆధారాలు సేకరించి రికవరీకి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. నిందితుడుని అరెస్ట్‌చేసి కోర్టులో హాజరుపరిచామని అన్నారు.

బహిరంగ ప్రకటన

[illegible]

లంకా విజయ్‌కుమార్, లంకా వంశీక్రిష్ణ

9030595227, 9848052914

బహిరంగ ప్రకటన

[illegible]

లంకా విజయ్‌కుమార్, లంకా వంశీక్రిష్ణ

9030595227, 9848052914

బహిరంగ ప్రకటన

[illegible]

లంకా విజయ్‌కుమార్, లంకా వంశీక్రిష్ణ

9030595227, 9848052914